క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



టెంకాయ కొట్టిన జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: మండలంలోని వంతరాం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి అంపావల్లి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ రవికుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.25లక్షలతో 450మీటర్ల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ ఉన్న లింకు రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, జి.సత్యంనాయుడు, జి.జగన్, అంపావల్లి గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



విశేష అలంకరణలో కామాక్షమ్మ

సాలూరు: పట్టణం, మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి, కామాక్షమ్మ, సంతోషి మాత, తదితర ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

శక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

సీతానగరం: శ్రావణమాస మహోత్సవాలను పుస్కరించుకుని శ్రావణ శుక్రవారం ఆఖరి రోజు కావడంతో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని చినబోగిలి, గుచ్చిమి, నిడగల్లు గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు.

సంతాపం



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది

సాలూరు: మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న టి.రమేష్ అనారోగ్యంతో విజయనగరం తిరుమల ఆస్పత్రిలో శుక్రవారం వేకువజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సూరినాయుడు, అధికార్లు, కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, ఈశ్వరరావు, తదితరులు మున్సిపల్ కార్యాలయంలో రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు పింఛన్ల పంపిణీ

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చేతులమీదుగా శనివారం పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సూరినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 134 పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. పట్టణంలోని సీతారామధర్మశాల, శివాలయం రోడ్ వద్ద పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ప్రజారోగ్యంపై సర్కారు ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతపై వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతుందని లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. తమ పంచాయతీ, సచివాలయ పరిధిలో ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరితో కలసి ఇంటింటా ప్రచారం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, వలంటీర్లు 15 రోజుల పాటు ప్రత ఇంటిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక కేష్ సీట్ రూపొందిస్తారన్నారు. అటుపై ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాచలం పాల్గొన్నారు.

జీసీఎంఎస్‌లో ఇంటర్నల్ ఆడిట్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచ్ పరిధిలో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలపై ఇంటర్నల్ ఆడిటర్ ఎన్.ఎం.నాయుడు శుక్రవారం ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో ఉన్న డీఆర్ఎస్ గొదాం, గ్యాస్ గొదాం, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, పెట్రోల్ బంకును సందర్శించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు.

అవినీతికి దూరం..



బీజేపీ నాయకుడు దొడ్డి సాయిబాబుకు పింఛన్ సొమ్ము అందిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మక్కువ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతికి దూరంగా ఉంటూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం స్థానిక సాయిభగవాన్ కల్యాణ మంటపంలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజన్నదొర కొత్తగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బీజేపీ ఎంపీటీసీ సభ్యుడు దొడ్డి సాయిబాబు, టీడీపీ నాయకుడు గాడి సత్యంలకు కూడా పింఛన్లు మంజూరు చేశామంటే, తామెంత కచ్చితంగా ఉన్నామో అర్థం చేసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమం అందడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. సాలూరు నియోజకవర్గంలో అన్ని మండలాల కంటే అత్యధికంగా మక్కువలోనే సుమారు 8,700 పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా 359 మందికి పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. గత టీడీపీ పాలనలో పింఛన్లు పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులు అవసరమయ్యేవన్నారు. కాని వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హత ఉంటే చాలు అన్ని సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దనే అందుతున్నాయని చెప్పారు. మండల కేంద్రానికి రహదారి నిర్మాణమై జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వద్ద చర్చించామన్నారు. టీడీపీ నాయకుల చెప్పుడు మాటలు వినవద్దని.. ఏ పార్టీ అభివృద్ధి, సంక్షేమం అందిస్తుందో గమనించి, ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



నాలుగున్నరేళ్ల దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న మంత్రి రాజన్నదొర, మావుడి సోదరులు

ఆత్మీయ స్వాగతం..







ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి విజయపగరం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

రక్తదాతలు ప్రాణదాతలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించేందుకు రక్తదానం చేసిన వారు ప్రాణదాతలవుతారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. శుక్రవారం ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇంజినీర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కంటే రక్తదానం మిన్న అని అన్నారు. సామాజిక సేవాభావంతో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకురావాలని కోరారు. యువత స్ఫూర్తిగా తీసుకుని ప్రజల్లో రక్తదానంపై చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పంచాయతీరాజ్, సమాచార పౌర సంబంధాల శాఖ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి జి.మల్లికార్జున రావు, డా. ఎంవీజీ కృష్ణాజీ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు, గంటా చంద్రమౌళి, డీఈలు లక్ష్మణరావు, రత్నకుమార్, లోకనాథం, వైద్యులు పి.అప్పారావు, ఎం. మధు, వీసీహెచ్ నాయక్, పీవీ జ్యోతి, జిల్లా అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పంచాయతీ రాజ్ సిబ్బంది

దేశ నాయకుల చరిత్ర పుస్తకాల పంపిణీ

పార్వతీపురంటౌన్: భారత జాతిరత్నం మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని వృద్ధ మిత్ర కోఆర్డినేటర్, హెడ్‌కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి అన్నారు. ఇంజినీరింగ్ దినోత్సవం, అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా పార్వతీపురం పట్టణ పరిధిలో జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దేశ నాయకుల చరిత్ర పుస్తకాలు, పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు చీరలు, స్టీల్ గ్లాసులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జి.హేమసుందర్ రావు సమక్షంలో వాటిని అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాసరావు, డి.తిరుపతిరావు, ఎ.అప్పారావు, కేవీవీఎన్ ఎస్. లక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రాజులు పాల్గొన్నారు.



పుస్తలకాలు పంపిణీ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి

జేఏఎస్ గ్రామసభలు విజయవంతం చేయాలి

సీతానగరం: ప్రజారోగ్య భద్రతకు ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న జగనన్న సురక్ష (జేఏఎస్) గ్రామసభల్లో ప్రజలను చైతన్యపర్చాలని తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట సచివాలయంలో శుక్రవారం ఉపసర్పంచ్ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో మూడు గ్రామాల ప్రజలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామవలంటీర్లు, గృహసారథులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రముఖ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి క్షేత్ర స్థాయిలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడమే కాకుండా అవసరమైన వారికి వైద్యసేవలు అందించనుందని తెలిపారు. ఈ మేరకు ముందుగా గ్రామాలవారీగా గృహసారథులు, వలంటీర్లు, వైద్యసిబ్బంది ద్వారా ప్రజలను చైతన్యపర్చడానికి గ్రామసభలు నిర్వహిచనున్నట్లు చెప్పారు. అలాగే అన్నిగ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణలో రెవెన్యూ, మండల పరిషత్, వైద్యాధికారుల అవగాహన సదస్సులు నిర్వహిస్తారని, ఈ సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, వి.దానబాబు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

నేడు డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్

పాలకొండ రూరల్: ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛమైన శక్తి– సుస్థిరమైన భవిష్యత్తు అనే అంశంపై సేషనల్ వన్డే వర్క్‌షాప్ శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కళాశాల ఐక్యూ ఏసీ నేతృత్వంలో మానవాళి మనుగడకు ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రముఖ ఆచార్యులు, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో వర్క్‌షాప్, పోస్టర్ మేకింగ్, నినాదాలు రాయటంపై విద్యార్థులకు పీపీటీ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు చేపడతామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిచనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో ఇంటింటి సర్వే



పి.ఆమిటిలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సత్యంనాయుడు, ఎంపీడీఓ సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ నెల 30 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం గుమ్మలక్ష్మీపురం మండలంలో శుక్రవారం నుంచి ఇంటింటా సర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ ఏపీడీ సత్యంనాయుడు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు ఇంటింటికీ వెళ్లి జబ్బులు ఉన్న దీర్ఘకాలిక, అంటు వ్యాధులు ఉన్న వారి వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ఈ నెల 30 నుంచి ఆయా గ్రామాల్లో నిర్వహించే ఆరోగ్య సురక్ష శిబిరాలకు తరలించి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశిస్తూనే ప్రజలంతా సహకరించాలని కోరారు.

మారిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' షెడ్యూల్

గరుగుబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌లో కాస్త మార్పులు చోటుచేసుకున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. శుక్రవారం ఆమె మారిన షెడ్యూల్‌ను వివరించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 3న గొట్టివలస, 4న చినగుడబ, 5న కొత్తూరు, 6న నాగూరు, 10న పెదగుడబ, 11న తోటపల్లి, 12న రావుపల్లి, 18న సంతోషపురం, 19న ఉద్దవోలు, 20న పెద్దూరు, 25న ఉల్లిబద్రలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆయా గ్రామాల్లోని పాఠశాల ప్రాంగణాలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

సీతానగరం: మండలంలోని చినభోగిలి వివేక వర్ధిని విద్యాలయం ఆవరణలో శ్రీకాకుళం రాగోలు జెమ్స్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచితమెగా వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకుడు ఎం.నారాయణరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎం.నర్సింగరావు, రత్నాలమ్మల జ్ఞాపకార్థం ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వైద్యశిబిరంలో బీపీ సుగర్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య పరీక్షల్లో పాల్గొనే రోగులకు వ్యాధి నిర్ధారణ చేసి అవసరమైన వారికి ఉచితంగా రాగోలులోని జెమ్స్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు చేయనున్నారని తెలిపారు. రోగులు ఆధార్, ఆరోగ్య శ్రీ కార్డులతో రావాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు అందనున్న ఉచిత వైద్యసేవలను చినభోగిలి పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు.

జగనన్నకు చెబుదాంలో ప్రతి సమస్యకు పరిష్కారం



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అర్జీలకు రశీదులు ఇస్తున్న సిబ్బంది

- జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు

బలిజిపేట: గ్రామస్థాయిలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో ముందుగా జిల్లా యంత్రాంగంతో ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీలను గ్రామ, మండలస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. వచ్చిన అర్జీకి సంబంధించి అన్ని అంశాలను పరిశీలించి సమస్య పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లా, మండలస్థాయి అధికారులందరూ గమనించాలని కోరారు. అక్కడికక్కడే పరిష్కారం జరిగేవి ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యాలయం ఆవరణలో అర్జీదారుల వివరాలను సిబ్బంది సేకరించి వివరాలను నమోదు చేసుకుని అర్జీదారులకు టోకెన్లు ఇచ్చి అధికారుల వద్దకు పంపించారు. ఈ సందర్భంగా 57మంది అర్జీదారులు వివిధ శాఖలకు సంబంధించిన వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ హేమలత, డీఎంహెచ్ఓ జగన్నాథరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ డీపీఎం అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్, డీఎస్‌డీఓ సాయి కుమార్, డీసీఓ సన్యాశిరావు, సీపీఓ వీర్రాజు, మార్కెటింగ్ ఎ.డి సుధీర్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ అప్పలరాజు, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

త్వరగా ఇంకుడు గుంతల ఏర్పాటు

బలిజిపేట: ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని జాతీయ ఉపాధిహామీ పథకం పీడీ రామచంద్రరావు సూచించారు. ఈ మేరకు బలిజిపేట, తుమరాడలలో ఇంకుడు గుంతల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకుడు గుంతల వల్ల ఎంతో ప్రయోజనం ఉందన్నారు. అందుకే ప్రతి ఇంటి దగ్గర, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వాటి నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచిస్తున్నామన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద నియమ, నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. ఈ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.



తుమరాడలో ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు



జేఏఎస్‌తో ఇంటి వద్దకే వైద్యం



చిలకలపల్లి సచివాలయంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

- డీఎంహెచ్ఓ జగన్నాథరావు

బలిజిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమంలో ప్రతి కుటుంబానికి అత్యుత్తమమైన వైద్యసేవలు అందించనున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మండలంలోని చిలకలపల్లి సచివాలయంలో వలంటీర్లు, వైద్యశాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజలకు ఇంటివద్దే వైద్య పరీక్షలు, ఉచిత వైద్య సలహాలు, ఉచిత మందులు అందించనున్నట్లు చెప్పారు. వీటికి సంబంధించి ఈ నెల 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. వైద్యశిబిరం నిర్దేశిత గ్రామంలో 15రోజుల ముందుగా ప్రతి ఇంటికి వలంటీర్, గృహసారథులు, ప్రజాప్రతినిధులు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఆ తరువాత ఇంటింటికి ఆరోగ్య సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటివద్దనే బీపీ, మధుమేహం, రక్తహీనత, మూత్రం, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు నిర్వహించి వ్యాధి గ్రస్తులను తనిఖీచేసి రోగుల జాబితా తయారుచేయనున్నామని తెలిపారు.

30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వైద్యశిబిరాలకు రెండు రోజుల ముందు రోగులను సన్నద్ధం చేసి తరువాత నిర్ధారించిన తేదీలలో ఏర్పాటుచేసే శిబిరాలకు రోగులను తరలించి, పరీక్షల అనంతరం మందులు అందజేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు, వైద్యాధికారిణి కిరణ్మయి, సీహెచ్ఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.